## శుభవార్త దేవాలయాన్ని సందర్శించిన జర్మనీ దేశస్తులు



శుభవార్త దేవాలయంలో సన్మానం పొందిన జర్మనీ దేశస్తులు

మఠంపల్లి, జనవరి 28 : మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయాన్ని జర్మనీ దేశానికి చెందిన 30 మంది సభ్యులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫాదర్ మార్టిన్ పసల ఏర్పాటు చేసిన దివ్యబలి కార్యక్రమంలో వారు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక, కోలాట ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో ఫాదర్స్ ఏరంరెడ్డి రాజనికుమార్‌రెడ్డి, అల్లం బాలరెడ్డి, శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్ రెడ్డి, ఆదూరి కిశోర్‌రెడ్డి, గాలి చిన్నపురెడ్డి, ఆదూరి మర్రెడ్డి, తిరుమలరెడ్డి, బాల శౌరెడ్డి, అల్లం జోజిరెడ్డి, మరియామాత సభ్యులు, గాన కచేరి బృందం సభ్యులు పాల్గొన్నారు.

# దౌర్జన్యాలు మితిమీరితే ప్రజలు తిరుగబడతారు

**దామోదర్‌రెడ్డి.. మీరు మారండి... మీ వారిని మార్చండి**

**ప్రజాస్వామ్యంలో ఎవరి అభిప్రాయం వారికి ఉంటుంది**

**బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు వెళ్లిన వారిపై నేను కక్ష కట్టలేదే**

**గత పదేండ్లు సూర్యాపేట ప్రశాంతంగా ఉంది.. దానిని పాడు చేయొద్దు**

**సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి.. పావని ఇంటికి వెళ్లి పరామర్శ**

**కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల దౌర్జన్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ**



సూర్యాపేటలో గండూరి పావని కృపాకర్ ఇంటికి వెళ్లి పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ తదితరులు

సూర్యాపేట, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : 'సూర్యాపేటలో మూడు సార్లు ప్రజల చేతిలో తిరస్కరించబడ్డ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తన బుద్ధి మార్చుకోలేదు... తిరస్కరణకు కారణాలు తెలుసుకోవడం లేదు.. అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు చేరువలో ఉండి సేవ చేస్తే మంచిది.. ఘర్షణలు, దాడులు తగవు.. దౌర్జన్యాలు మితిమీరితే ప్రజలు తిరుగబడతారు.. సూర్యాపేట ప్రజలు ఎంతో చైతన్యవంతులు, నిజాం నిరంకుశత్వంపైనే ఇక్కడి వ్యాపారులు తిరుగబడ్డ చరిత్ర ఉంది... నిజాం కంటే నీవు శక్తివంతుడివేం కాదు' అని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. 'అరాచకాల దారి నుంచి మారుతూ మీ అనుచరులు, మీ పార్టీ వారిని మార్చాలని' సూచించారు. కౌన్సిలర్ పావనీకృపాకర్ నివాసం వద్ద కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ చేసిన దౌర్జన్యం, దాడుల విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హుటాహుటిన ఆదివారం సాయంత్రం సూర్యాపేటకు చేరుకున్నారు. ఎమ్మెల్యే వస్తున్న సమాచారంతో స్వచ్ఛందంగా వందలాది మంది బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి విద్యానగర్‌లోని పావనీకృపాకర్ నివాసం వరకు ఆ మూడు పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లారు. గండూరి పావనీకృపాకర్‌కు అండగా ఉంటామంటూ ధీమా కల్పించారు. కాగా జగదీశ్‌రెడ్డి అక్కడకు చేరుకొని వారిని పరామర్శించి సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎవరి అభిప్రాయం వారికి ఉంటుందని, వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రధానంగా రాజకీయాల్లో ఉండే వారికి ఎంతో అవసరమన్నారు. బీఆర్ఎస్ నుంచి చాలా మంది ఇతర పార్టీలకు వెళ్లారని, అలాగని వారిపై తాను ఎలాంటి కక్ష పెంచుకోలేదని తెలిపారు. గత పదేండ్లుగా సూర్యాపేట ఎంతో ప్రశాంతంగా ఉంటూ అభివృద్ధిలో దూసుకుపోయిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉన్నందున చేతనైతే మరిన్ని నిధులు తెచ్చి సూర్యాపేట అభివృద్ధిని కొనసాగించాలి తప్ప దౌర్జన్యాలు, కక్షలు సరికాదని రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి సూచించారు. మళ్లీ దౌర్జన్యాలకు పాల్పడి సూర్యాపేట బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించవద్దని హితవుపలికారు. పావనీకృపాకర్ బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి ఎవరో ఏదో మాయమాటలు చెబితే పార్టీ మారారని తానుగానీ, తన పార్టీ కేడర్‌గానీ ఒక్కసారి కూడా విమర్శలు చేసిన దాఖలాలు లేవన్నారు. అసలు 32 మంది అవిశ్వాస తీర్మానంపై సంతకం చేస్తే ఒక్కరు కూడా రాలేదని, మరి చైర్మన్‌పై అసంతృప్తి ఉంటే ఎందుకు వచ్చి సమావేశంలో వ్యక్తపర్చలేదో వారికే తెలియాలని చెప్పారు. ఇకనైనా దాడులు, దౌర్జన్యాలకు స్వస్తి పలుకాలని కోరారు.

# అవిశ్వాసానికి మద్దతు తెలుపలేదని దాడి

**కౌన్సిలర్ గండూరి పావనీకృపాకర్ ఇంటిపై అసమ్మతి కౌన్సిలర్ల దౌర్జన్యం**

**ఇంటిపై కోడిగుడ్లు విసిరిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ వర్గాలు**

**సూర్యాపేటలో ఉద్రిక్త వాతావరణం**

**తోపులాటలో బీఆర్ఎస్ నాయకుడు వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, పలువురికి గాయాలు**



కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఇంటిపై దాడికి పాల్పడుతున్న కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ కౌన్సిలర్ల వర్గాలు



గండూరి పావని కృపాకర్ ఇంట్లోకి విసిరిన కోడిగుడ్లు



దాడిలో చిరిగిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు షర్టు

సూర్యాపేట, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసానికి మద్దతు తెలుపలేదని 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావనీకృపాకర్ ఇంటిపై కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీకి చెందిన అసమ్మతి కౌన్సిలర్లు ఆదివారం దాడికి పాల్పడ్డారు. ఇంటిపై గుడ్లు, రాళ్లు విసురుతూ దౌర్జన్యానికి తెగబడ్డారు. విషయం తెలుసుకొని నిలువరించేందుకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి రావడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరినొకరు దుర్భాషలాడుకున్నారు. ఈ దాడిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వర్లు డ్రెస్ చినికిపోగా, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, ఆమె వెంట ఉన్న అనుములపురి భానుకు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే బీఆర్ఎస్‌లో ఉండి చైర్మన్ పదవి కోసం ఇతర పార్టీలతో జతకట్టిన కొండపల్లి నిఖిలకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో సూర్యాపేటలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకొని ఘర్షణ జరుగకుండా చర్యలు తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన 32 మందిలో చాలా మంది ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి మూడు నుంచి నాలుగు సార్లు మారిన వారు ఉన్నారు. అయితే అవిశ్వాసం వీగిపోవడానికి గండూరి పావనీకృపాకర్ కారణమని కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ వర్గాలు దౌర్జన్యానికి పాల్పడ్డాయి. బీఆర్ఎస్ నాయకులు అక్కడికి రావడం ఆలస్యమైతే పరిస్థితి భయానకంగానే మారి ఉండేదని బాధితులు తెలిపారు. అనంతరం ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి.

## ప్రజలు ఓటు వేయకుంటే ఇలాగే దాడులు చేస్తారా?

**దాడులకు తెరలేపిన కాంగ్రెస్**

**ప్రశాంతంగా ఉన్న సూర్యాపేటలో మళ్లీ దౌర్జన్యాలు**

**మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ**

బొడ్రాయిబజార్, జనవరి 28 : 'నాపై పెట్టిన ఆవిశ్వాసాన్ని విశ్వాసంతో గెలిచారు. దళిత మహిళకు అన్యాయం జరుగుతుందని భావించి 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావనీకృపాకర్ నాకు మద్దతు పలికారు. దీన్ని సహించని కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లను పావనీకృపాకర్ ఇంటిపై దాడికి ఉసిగొల్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. గండూరి పావనీకృపాకర్ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గండూరి పావనీకృపాకర్ బీఆర్ఎస్ పార్టీ ద్వారా కౌన్సిలర్‌గా గెలిచారని, ప్రస్తుతం బీఆర్ఎస్‌కు మద్దతు పలికారన్నారు. ప్రజాస్వామ్యంలో తన ఓటును నిజాయితీగా ఉపయోగించారని, ప్రజలు ఓట్లు వేయకుంటే ఇలాగే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. అవిశ్వాసం వీగిపోయినప్పటికీ పదేండ్లుగా ప్రశాంతంగా ఉన్న సూర్యాపేటలో మళ్లీ కక్షలు, దాడులకు తెరలేపుతూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మద్దతు ఇచ్చిన కౌన్సిలర్‌పై దాడి జరుగుతుందని తెలిసి తాను అక్కడికి వస్తే తనపై, తన వెంట వచ్చిన వారిపై దాడి చేయడమే కాకుండా తామే దాడి చేశామని చెప్పడం దుర్మార్గమన్నారు. మూడు సార్లు ప్రజలు తిరస్కరించినా కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డికి బుద్ధి రాలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**బహుజన బిడ్డకు అండగా ఉన్నా.. ప్రలోభాలకు లొంగలేదు : గండూరి పావనీ కృపాకర్**

అవిశ్వాసానికి తెరలేపిన రోజునే మొదటిసారి గెలిచిన కొండపల్లి నిఖిలా దిలీప్ రెడ్డికి కాకుండా రెండుసార్లు గెలిచిన బీసీ బిడ్డనైన తనకు చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలని కోరానని గండూరి పావనీ కృపాకర్ తెలిపారు. అగ్రవర్ణాలకే చైర్మన్ పదవి అని చెప్పడంతో దళిత మహిళకు అండగా ఉండి అవిశ్వాసానికి దూరంగా ఉన్నామని, వారు అనుకుంటున్నట్లు ఎలాంటి ప్రలోభాలకూ లొంగలేదని చెప్పారు. తాను కొండపల్లి నిఖిలకు మద్దతు ఇవ్వలేదని, వారితో కలిసి క్యాంపునకు కూడా వెళ్లలేదని అన్నారు. తన వార్డులో ప్రజాదరణ కలిగిన నాయకురాలిగా సొంత డబ్బులే ఖర్చు పెట్టాను తప్ప ఎవరి వద్ద డబ్బు తీసుకోలేదని చెప్పారు. తమ ఇంటిపై దాడి చేసి, భయభ్రాంతులకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. తాను త్వరలో బీఎస్పీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ నిమ్మల స్రవంతి, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఆకుల లవకుశ, గండూరి కృపాకర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి విద్యారంగం తొలి ప్రాధాన్యం కావాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం



టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

శాలిగౌరారం, జనవరి 28 : కొత్త ప్రభుత్వానికి విద్యారంగమే తొలి ప్రాధాన్యం కావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యను ప్రజల ఎజెండాలో పొందుపర్చినప్పుడు మాత్రమే సర్కారు విద్య బలోపేతం అవుతుందని, దీని కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విస్తృత సమావేశానికి నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యా రంగంలో అడుగులు పడాలన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వ బడుల మీద శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో విద్యా పోరాటాలు కావాలని, దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందరికీ నాణ్యమైన, గుణాత్మక విద్య అందించేలా చొరవ చూపాలని సూచించారు. అవసరం ఉన్నచోట, కొత్తగా అభివృద్ధి చెందుతున్న నగర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యేలు**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేసేది టీఎస్‌యూటీఎఫ్ అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బుక్ స్టాల్‌ను ఎమ్మెల్యే వీరేశం తిలకించి సాహితీ పుస్తకాలను కొనుగోలు చేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, శాలిగౌరారం జడ్పీటీసీ ఎర్ర రణీలాయాదగిరి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, టీపీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశం, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, నాయకులు బక్క శ్రీనివాసాచారి, అరుణ, మండల బాధ్యులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యేలు వీరేశం, సామేలు

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

- భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



గరిడేపల్లి : పొనుగోడు పాఠశాలల వజ్రోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గరిడేపల్లి/ మఠంపలి/ హుజూర్‌నగర్ రూరల్, జనవరి 28 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొనుగోడులో ఆదివారం నిర్వహించిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల వజ్రోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. పొనుగోడు గ్రామ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే లైబ్రరీ నిర్మాణం, దాని అభివృద్ధికి మరో రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. ఆరోగ్య ఉప కేంద్రాన్ని పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాలు, మండలాలపై త్వరలో కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పొలాలకు నీటిని విడుదల చేయాలని పలువురు రైతులు కోరగా.. సాగర్‌లో నీరు తక్కువగా ఉన్నందున తాగునీటి అవసరాల రీత్యా సాగుకు నీళ్లివ్వలేమని చెప్పారు. అదేవిధఃగా మఠంపల్లి మండలం కృష్ణ తండాలో, హుజూర్‌నగర్ మండలం లింగగిరిలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మఠంపల్లి మండలానికి ఉపాధిహామీ నిధులు కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 540 సర్వే నంబర్‌లో భూములు కోల్పోయిన గిరిజన రైతులకు భూములు ఇప్పిస్తామని, గిరిజన రిజర్వేషన్లు పెంచుతామని హామీఇచ్చారు. త్వరలో రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. లింగగిరిలో రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.30 లక్షలు, శ్మశాన వాటిక, ఈద్‌గాహ్‌లకు రూ.10 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. సాగు నీటి కోసం లిఫ్టులు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్, డీఎస్పీ ముత్తినేని సోమనాథం, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, తాసీల్దార్లు బి.కవిత, నాగార్జునరెడ్డి, ఎంఈఓ చత్రునాయక్, సర్పంచులు జోగు సరోజిని, బాణోతు రామారావు, కర్నాటి అంజిరెడ్డి, ఎంపీటీసీలు మేళ్లచెర్వు వెంకటరమణ, రాంమల్లమ్మ, విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ కట్టా గోపాల్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాముల శివారెడ్డి బపాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా సాయి అభిజ్ఞ



తిరుమలగిరి (సాగర్), జనవరి 28 : మండలం కేంద్రానికి చెందిన వల్లవాయి సాయి అభిజ్ఞ జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ బాలికల రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైంది. నల్లగొండలో 8వ తరగతి చదువుతున్న సాయిఅభిజ్ఞ కబడ్డీలో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను చాటుతూ వస్తున్నది. ఈ నెల ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా రాజవరంలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆమె కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు కోచ్‌లు ఉపేంద్ర, కాశీ తెలిపారు. సాయిఅభిజ్ఞ జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, క్రీడాకారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సూర్యాపేట జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీలు

సూర్యాపేటసిటీ, జనవరి 28 : సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎన్.బాలు నాయక్‌ను వీఆర్ సూర్యాపేట నుంచి సూర్యాపేట రూరల్ పీఎస్, బి.వెంకటరెడ్డిని వెయిటింగ్ జోన్ ఇన్ డీఐజీ జోన్ యాదాద్రి నుంచి చివ్వెంల పీఎస్‌కు, ఐ.మహేంద్రనాథ్ సూర్యాపేట టౌన్ 1 నుంచి అర్వపల్లి పీఎస్‌కు, పి.మధు డీఏబీ సూర్యాపేట నుంచి మద్దిరాల పీఎస్‌కు, కె.సత్యనారాయణ డీఎస్బీ నల్లగొండ నుంచి తిరుమలగిరి పీఎస్‌కు, ఎం.ఏడుకొండలు నడిగూడెం నుంచి తుంగతుర్తి, వై.సైదులు నాగారం నుంచి ఆత్మకూర్.ఎస్, పి.రవీందర్ సూర్యాపేట టౌన్ 1 నుంచి పెన్‌పహాడ్‌కు, ఆర్.సాయిరాం సూర్యాపేట రూరల్ నుంచి డీఎస్బీ సూర్యాపేట, పి.విష్ణుమూర్తి చివ్వెంల నుంచి డీఎస్బీ సూర్యాపేట, బి.అంజిరెడ్డి అర్వపల్లి నుంచి వీఆర్ సూర్యాపేట, వై.ప్రసాద్ తిరుమలగిరి నుంచి వీఆర్ సూర్యాపేట, కె.వెంకట్‌రెడ్డి ఆత్మకూర్.ఎస్ నుంచి వీఆర్ సూర్యాపేట, ఎన్.వెంకన్న పెన్‌పహాడ్ నుంచి సీసీఎస్ సూర్యాపే ట, బి.సాయి ప్రశాంత్ కోదాడ రూరల్ నుంచి సీసీఎస్ సూర్యాపేట, బి.ప్రవీణ్‌కుమార్ తుంగతుర్తి నుంచి సూర్యాపేట టౌన్ 1కు బదిలీ అయ్యారు.

### నల్లగొండలో ఆరుగురు ఎస్ఐలు

నీలగిరి, జనవరి 28 : నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు ఎస్ఐలను ఐజీ కార్యాలయం ఆదేశాల మేరకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మిర్యాలగూడ రూరల్, తిప్పర్తి ఎస్ఐలు నరసింహులు, ధర్మాను వీఆర్‌కు అటాచ్ చేశారు. ఇటీవల నార్కట్‌పల్లి ఎస్ఐగా పనిచేసిన సైదానాయక్ సస్పెండ్ కాగా, ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న అంతిరెడ్డిని నియమించారు. సూర్యాపేట జిల్లాలో వీఆర్‌లో ఉన్న గోపతి సతీశ్‌ను మిర్యాలగూడ రూరల్‌కు, వీఆర్‌లో ఉన్న యాదయ్యను చింతపల్లి ఎస్ఐగా బదిలీ చేశారు. కట్టంగూర్ ఎస్ఐగా పనిచేస్తున్న డి.రాజు తిప్పర్తికి బదిలీ అయ్యారు.

# 5న నల్లగొండ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- విప్ ఉల్లంఘించిన వారిపై చర్యలు శూన్యం
- వారంలో చర్యలన్న అదనపు కలెక్టర్ మాటలు ఉట్టిదేనా?

నీలగిరి, జనవరి 28 : నల్లగొండ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఫిబ్రవరి 5న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 8న బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ పార్టీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గిన విషయం తెలిసిందే. అదేరోజు వైస్ చైర్మన్‌గా ఉన్న అబ్బగోని రమేశ్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ అదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడంతో ఆ పార్టీకి చెందిన చైర్మన్ సైదిరెడ్డి తన పదవిని కోల్పోవాల్సి వచ్చింది. అవిశ్వాసం నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన కౌన్సిలర్లకు ఆ పార్టీ విప్ జారీ చేసింది. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిన వారిపై చర్యలు తీసుకునేలా అప్పటికే విప్ జారీ చేసి సంబంధిత కాపీలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అవిశ్వాసంలో మొత్తం 15 మంది బీఆర్ఎస్ సభ్యులు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఓటింగ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధ్వర్యంలో వీడియోలో సైతం రికార్డు చేశారు. అవిశ్వాసం నెగ్గిన తరువాత వారం రోజుల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పిస్తామని మీడియా ద్వారా చెప్పారు. కానీ.. విప్ ఉల్లంఘించిన వారిపై ఏ నిర్ణయమూ తీసుకోకుండానే కొత్త చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**విప్ ఉల్లంఘనపై చర్యలు ఏవి?**

ప్రజాస్వామ్యంలో ఎన్నికల విధానంలో పటిష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయి. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లి పార్టీ నిర్ణయాలకు అతీతంగా వ్యవహరించిన వారి పదవి కోల్పోయేలా చట్టాలు రూపొందించారు. ఈ మేరకు నల్లగొండ నియోజకవర్గంలో గతంలో పగిడిమర్రి, రేగట్టె ఎంపీటీసీలు పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొంటే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వారిపై వెంటనే అనర్హత వేటు వేసి తిరిగి ఎన్నికలు నిర్వహించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక మున్సిపాలిటీల్లో చైర్మన్‌పై అవిశ్వాసాలు ప్రకటించారు. కొన్ని చోట్ల వీగిపోయినా.. నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఈ సందర్భంగా విప్ ఉల్లంఘించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీన్ని పక్కన పెట్టి చైర్మన్ ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి జిల్లా యంత్రాంగం సిఫార్స్ చేసింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగమే ఇలా ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడం ఏమిటని పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు.

## వలస బాటలో ఆయకట్టు కూలీలు

హాలియా, జనవరి 28 : దశాబ్ద కాలం పాటు నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు రైతులు దర్జాగా రెండు కార్లు పంటలు పండించుకొని ఆనందంగా జీవించారు. కాలు అడ్డం పెడితే పొలం పారడంతోపాటు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంతో రైతులు చింత లేకుండా ధాన్యం పండించుకున్నారు. ఈ ఏడాది ఎగువ నుంచి నాగార్జున సాగర్ జలాశయానికి వరద రాకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించడంతో ఆయకట్టు ప్రాంతంలో ఉన్న చిన్న, సన్నకారు రైతులు, కూలీలకు పని లేకుండా పోయింది. దీంతో జీవనం కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. నాన్ ఆయకట్టు ప్రాంతంలో మిర్చి, బత్తాయి తోటల్లో కూలి పనుల కోసం నిత్యం 20 నుంచి 30 కిలోమీటర్ల దూరం ఆటోల్లో ఇబ్బంది పడుతూ కిక్కిరిసిపోతున్నారు.



హాలియా నుంచి నాన్ ఆయకట్టు ప్రాంతానికి ఆటోలో పనులకు వెళ్లి వస్తున్న కూలీలు